# టీవీ గోల

- జి. స్వర్ణలత

**ఏదో పని ముగించుకుని హాల్లోకి వచ్చిన జానకికి భర్త రామారావు టీవీలో క్రికెట్ మ్యాచ్ చూస్తూ "ఫోర్...సిక్స్" అంటూ చిన్నపిల్లాడిలా చప్పట్లు కొడుతూ ఆటలో లీనమవడం చూసింది.**

''రాధా! గోపీ ఏం చేస్తున్నాడే? ఎంతసేపట్నుంచి పిలిచినా రావడంలేదు'' అని కూతుర్ని కేకేసింది జానకి విసుగ్గా.

''ఏంటి మమ్మీ! వాడు ఏంటో సీరియస్‌గా రాసుకుంటున్నాడు. ఏం కావాలో చెప్పు. నేను చేస్తా'' అంది రాధ.

''పోపుల డబ్బాలో పెట్టిన డబ్బు కనిపించడంలేదు. వాడుగానీ తీసాడా? తెలుసుకుందామని పిలిస్తే వినిపించడం లేదు వాడికి''

''అవును మమ్మీ! వాడే రోజూ నీవు దాచుకున్న డబ్బు తీస్తున్నాడు. కాంపిటీషన్ కార్డులకని. రోజూ ఐదారు కార్డులు తెచ్చి పంపిస్తున్నాడు''


''కాంపిటీషన్ కార్డులు దేనికే?''

''టీవీలో అడిగే ప్రశ్నలకు సరైన జవాబులు రాస్తే కళ్లు చెదిరే బహుమతులు అని రోజూ ప్రకటిస్తున్నారుగా''

''కాంపిటీషన్ చదువులో పెట్టుకొమ్మని నాన్నగారు మీ కాలేజీలకు, కోచింగులకు ఎంతో ఖర్చు చేస్తుంటే వాడు చేసే నిర్వాకం ఇదా? సరేగానీ వాడిని పిలు. మీ ఇద్దరికీ భోజనం పెడితే నాకు వేరే పనులు చాలా వున్నాయి'' అని జానకి తన పనిలో నిమగ్నురాలైంది.

''మమ్మీ! వాడు రాడట. ఏదో లెటర్ రాస్తున్నాడు. నాకు ఆకలి దంచేస్తోంది. భోజనం వడ్డించు'' అంది రాధ.

''ఉండవే. ఇద్దరికీ ఒకేసారి పెడ్తాను. నేవెళ్లి పిలుస్తా'' అంటూ కొడుకు గదిలోకి వెళ్లిన జానకి నిశ్చేష్టురాలైంది. గది నిండా సగం సగం రాసిన కాగితాలు చించి పోస్తూ తల




పట్టుకుని దీర్ఘంగా ఆలోచిస్తున్న గోపీని చూసి-

''ఏరా! ఏదైనా లెక్క రావడం లేదా? నాన్నగారు వచ్చాక చెప్పించుకోవచ్చు. వేరే ఏదైనా సబ్జెక్టు చదువుకో'' అంటున్న తల్లిని చూసి ''మమ్మీ! నిన్నొకటడుగుతా. చెప్తావా?''

''ఏంటిరా? నాకేం తెలుసు?'' అంది జానకి.

''ప్రేమలేఖ రాయాలి. చెప్పవే. నాకు ఎలా మొదలుపెట్టాలో తోచడంలేదు''

ఒక్కసారిగా నోరు తెరిచి నిర్ఘాంతపోయింది జానకి.

''అదేం పోయే కాలంరా! నీకు నేను ప్రేమలేఖ రాయడం నేర్పాలా? నీ వయసెంత? నీవు చదువుకుని ఉద్ధరిస్తావని ఎన్నో వ్యయప్రయాసలకోర్చి కష్టపడుతుంటే నీవు చేసే నిర్వాకం ఇదా?''


''కాదు మమ్మీ! టీవీవారు నిర్వహించే ప్రేమలేఖ పోటీలో గెలుపొందితే సినిమాకు ఫ్రీగా టిక్కెట్టిచ్చి అభిమాన తారలచే బహుమతులు అందజేస్తారు'' అని చెప్పగానే జానకికి టీవీని ఉన్నఫళాన పగలగొట్టాలన్నంత కోపం వచ్చింది. ఏమనాలో తోచక గోపీని భోజనానికి పిలిచింది.


భోజనం ముందు కూర్చున్న గోపీ దీర్ఘాలోచనలో మునిగి అన్నాన్ని అటూ ఇటూ కెలుకుతూ కూర్చున్నాడు. ఎంతోసేపు ఓపిక పట్టిన జానకి ''గోపీ! త్వరగా తిను. నీ ఆలోచనంతా ప్రేమలేఖ గురించేనా?'' అంది.

''కాదు మమ్మీ. కాంతారావు భార్య పేరేమిటా అని ఆలోచిస్తున్నా''

''నీకెందుకురా అతని భార్య ఎవరైతేనేమి?''

''కాదు మమ్మీ. మనసున మనసై కార్యక్రమంలో ఈ ప్రశ్న అడిగారు. దీనికి సరైన సమాధానం రాసి పంపితే రెండు వేల రూపాయల బహుమతి వస్తుంది. పోయినసారి ఊహ భర్త పేరు అడిగితే శ్రీకాంత్ అని పంపాను. ఈసారి తెలియడంలేదు. కాంతారావు మీ




చిన్నప్పటి హీరోగా. నీకు తెలిస్తే చెప్పు మమ్మీ''

''నీకేదో పిచ్చి పట్టిందిరా. నాకు చాలా పనుంది. ఈ పిచ్చి పిచ్చి ఆలోచనలు మాని శ్రద్ధగా చదువుకో. మంచి భవిష్యత్తు వుంటుంది. ఎవరి భార్య ఎవరైతే మనకెందుకు? కష్టపడకుండా సంపాదించిన డబ్బు నిలవదు. ఈ పనికిమాలిన బహుమతులు వద్దు. నేను మంచిగా చెబుతున్నాను విను. ఈ టీవీవాళ్లు మిమ్మల్ని ఎందుకూ కొరగాని వాళ్లలా చేస్తున్నారు'' ఎలాగో భోజనం ముగించి విసురుగా తన గదిలోకి పోయాడు గోపి.

''అమ్మా రాధా! ఇలారా!'' అని ఎన్నిసార్లు పిలిచినా రాని కూతురు అసలు ఇంట్లో వుందా? అని సందేహంగా హాల్లోకి వచ్చింది జానకి. దీర్ఘంగా టీవీ చూస్తున్న కూతుర్ని చూసి ''ఎన్నిసార్లు పిలిచినా రావేంటే?'' అంది జానకి.

''ఉండు మమ్మీ. సాయంత్రం ఏడు నుండి తొమ్మిదివరకు నన్ను డిస్టర్బ్ చేయవద్దని ఎన్నిసార్లు చెప్పాను. ప్రోగ్రాం మిస్ కాకుండా చూసి టీవీ వాళ్లు అడిగే ప్రశ్నలకు జవాబు రాసి పంపితే విలువైన బహుమతులు ఇస్తారు. నన్ను విసిగించకు'' అంది రాధ.

ఈయనగారు ఆఫీసు నుంచి రాగానే దీనికి పరిష్కారం అడగాలి. ఇలా అయితే కాంపిటీషన్‌తో కూడుకున్న చదువులో పిల్లలు నెగ్గుకురావడం కష్టం అనుకుంది జానకి.

ఏదో పని ముగించుకుని హాల్లోకి వచ్చిన జానకికి భర్త రామారావు టీవీలో క్రికెట్ మ్యాచ్ చూస్తూ ''ఫోర్...సిక్స్'' అంటూ చిన్నపిల్లాడిలా చప్పట్లు కొడుతూ ఆటలో లీనమవడం చూసింది.

''ఇప్పుడెక్కడిదండీ క్రికెట్ మ్యాచ్? ఇప్పట్లో లేదని రాత్రేగా చెప్పారు'' అంది జానకి.

''కాదు జానకీ! ఇది పోయిన సంవత్సరం జరిగిన ఇండియా పాకిస్తాన్ మ్యాచ్'' అని ''అవుట్'' అంటూ బల్లను చరుస్తూ ఆనందపడుతున్నాడు.

''అయిపోయిన మ్యాచ్ చూడ్డమెందుకండీ. ప్రతిసారీ మనవాళ్లు ఓడుతూనే ఉన్నారుగా. ఒకసారి చూడ్డమే దండగంటే మీరు మళ్లీ చూస్తున్నారంటే మీ ఓపికకు జోహార్లు''

''ఆఫీసులో పని చేసి అలసివచ్చి మ్యాచ్ చూడగానే ఇలా అంటావేమిటి? మీరేగా ఇంట్లో వుండి ప్రతి ప్రోగ్రాం చూస్తారం''టూ విరుచుకుపడ్డాడు రామారావు.

రాత్రి పడుకున్న జానకికి ఎంతోసేపటికీ నిద్రపట్టలేదు. ఇద్దరం కలసి ఆలోచించి టీవీని బహిష్కరించాలనుకుంటే ఈయనగారు కూడా ఇలా టీవీని వదలడంలేదు. పిల్లల భవిష్యత్తు ఏమిటని ఆలోచిస్తూ పరిష్కారం కనుగొన్నామన్న తృప్తితో తెల్లవారుఝామున నిద్రలోకి జారుకుంది జానకి.

మరుసటిరోజు స్కూలు నుండి వచ్చిన గోపి టీవీ పెట్టి ప్రోగ్రాం రాకపోయేసరికి ''ఏంటి మమ్మీ! కరెంటు ఉన్నా టీవీ రావడంలేదు'' పిచ్చివాడిలా అరుస్తున్నాడు.

''ఒక్కరోజు రాకుంటే మునిగిపోయేదేమీలేదు. భోజనానికిరా'' అంది జానకి.

''కాదు మమ్మీ. ఈ రోజు జెమినీ టీవీలో రిజల్ట్స్ వున్నాయి. అందుకనే ముందుగా వచ్చాను''

''నేనేం చేసేదిరా'' అంటూ వైరు తెంపిన సంగతి తలుచుకుని లోలోన నవ్వుకుంది జానకి.

రామారావు ఆఫీసునుంచి వస్తూనే టీవీ ఆన్‌చేసి ''ఏమైంది జానకీ? ఈ రోజు మ్యాచ్ వుంది. టీవీ రావడంలేదు'' అనకుంటూ బట్టలైనా మార్చుకోకుండా బయటకు హడావుడిగా వెళ్లి పదినిముషాల్లో మెకానిక్‌ను స్కూటర్‌పై తీసుకువచ్చాడు. అరగంటలో బాగు చేయించుకుని మెకానిక్‌ను పంపించి టీవీ పెట్టుకుని ''మ్యాచ్ మూడు ఓవర్లు మిస్సయిందని'' తెగ బాధపడి పోసాగాడు.

''వీళ్లని బాగు చేయడం నావల్లకాదు భగవంతుడా! నీవే ఏదైనా మార్గం చూపాలి'' అంటూ వేంకటేశ్వరస్వామివారి ఫోటోకు చేతులెత్తి దండం పెట్టింది జానకి.

★



## పాపం నగ్మా!

ఒకప్పుడు తెలుగు ఇండస్ట్రీని అదరగొట్టిన నగ్మా ఆనక తమిళ చిత్ర రంగాన్ని కూడా కొంతకాలం శాసించింది. అలాంటి నగ్మా సడన్‌గా తెరమరుగు కావడం ఆశ్చర్యకరమే! తమిళ హీరో శరత్ కుమార్‌తో ప్రేమాయణం విషయంలో ఆమధ్య పాపులర్ అయిన నగ్మా అది కాస్తా 'ఉత్తదే' అని తేలడం.. ఇప్పుడు మళ్లీ సినిమాల వేటలో పడ్డం కనిపిస్తోంది. కన్నడ చిత్ర రంగంలోకి ఇటీవలే వెళ్లిన నగ్మా ఆ సినిమా కూడా ఫ్లాప్ కావడంతో ఆమెకి ఏం చేయాలో తోచడం లేదు. ఇటీవల విడుదలైన భాగ్యరాజా తమిళ చిత్రం 'వెక్కియ ముడిచ్చు కట్టు' మాత్రం కొంతలో కొంత విజయం సాధించడం నగ్మాకి కొంత ఊరట నిచ్చింది. మరి నగ్మాకి మంచి రోజులెప్పుడో?

-జె.ఎం.